విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

సోమవారం 27 అక్టోబరు 2025 8 పేజీలు

ముంచుకొస్తున్న మొంథా తుపాను

☞ తుపానును ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో ఉండాలి
☞ కలెక్టర్ షణ్మోహన్, మైలవరపు కృష్ణ తేజ

విశాలాంధ్ర - కాకినాడ : మొంథా తుఫాన్‌ను ప్రభావం కాకినాడ జిల్లాపై అధికంగా ఉంటుందన్న వాతావరణం శాఖ హెచ్చరికల నేపథ్యంలో తుఫానును సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో ఉండాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ జిల్లా ప్రత్యేక అధికారి మైలవరపు కృష్ణ తేజ అధికారులను ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నం కాకినాడ జిల్లా మొంథా తుఫాను ప్రత్యేక అధి కారి, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజతో కలిసి జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కాకినాడ ఆయన క్యాంపు కార్యాలయం నుంచి మొంథా తుఫా ను సందర్భంగా చేపట్టవలసిన ముందస్తు ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఉన్నత స్థాయి జిల్లా అధికారులు అన్ని మండలాల క్షేత్రాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడు తూ..మొంథా తుఫాను ప్రభావం తీర ప్రాంత మండలాలపై ఎక్కువ ఉండే అవకాశం ఉందన్నారు. ఈ తుఫాను కారణంగా అన్ని గ్రామాల్లోనూ వర్షం కురవడంతో పాటు తీవ్రమైన ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినట్లు ఆయన తెలిపారు. కాకినాడ జిల్లాలో ప్రధానంగా తొండంగి, ఉప్పాడ, తాళ్లరేవు, కాకినాడ రూరల్, కాకినాడ పట్టణ ప్రాంతాధికారులు మరింత అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. ఇప్పటికే హోప్ ఐలాండ్‌లో ఉన్న సుమారు నూట పది మందిని పునరావాస కేంద్రాలకు తీసుకుని రావడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

మొంథా తుఫాను ప్రభావంతో ఈ నెల 27 నుండి 29వ తేదీ వరకు జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అన్ని గ్రామాల్లో తుఫాను హెచ్చరికలు జారీ చేసి అప్రమత్తంగా ఉండాలని ప్రజ లందరికీ తెలియజే యాలన్నారు. అన్ని మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌లు, తహసి ల్దారులు, ఎస్హెచ్ఓలు, మండల ప్రత్యేక అధికారులు కలిసికట్టుగా సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం జరగ కుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాను వలన గంటకు 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయన్నారు. ఆ గాలులకు విద్యుత్ స్తంభాలతో పాటు చెట్లు కూలిపోయే అవకాశం ఉంద న్నారు. ముఖ్యంగా తాటాకు ఇల్లు, పూరిపాకలు, ▶మిగతా 2లో..

ఈశ్వరయ్యను కలిసిన నరేందర్‌రెడ్డి

విశాలాంధ్ర - అమలాపురం : విజయవాడ నగరంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ స్థానంలో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్య దర్శి గుజ్జల ఈశ్వర య్యని రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యు)స్టేట్ జాయింట్ సెక్రటర్ కంటెపల్లి నరేంద్ర రెడ్డి మర్యాద పూర్వకంగా విజయవాడ సీపీఐ కార్యాలయంలో కలిసారు. గుజ్జల ఈశ్వరయ్య చాలాకాలం పాటు విద్యార్థి సంఘ నాయకుడుగా జాతీయస్థాయిలో పనిచేసి ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా ఎదగడం గర్వపడే విషయం చాలా కాలం నుంచి దాదాపు పది సంవత్సరాలు నుంచి మా ఇద్దరి మధ్య ఉన్నటువంటి విద్యార్థి నాయకునిగా విద్యార్థుల సమస్యలపై మాట్లాడుకోవడం జరిగింది. విద్యార్థి సంఘ నాయకుడుగా మంచి పేరు తెచ్చుకొని సమాజంలో కీర్తి ప్రతిష్టలు తెచ్చుకోవాలని వారి ఆశీస్సులు పొందడం జరిగిందనీ నరేంద్రరెడ్డి తెలిపారు.

14,15 తేదీల్లో రైతు సంఘం జిల్లా మహాసభ

రైతు సంఘం రాష్ట్ర నాయకులు బలరాం

విశాలాంధ్ర-పాలకోడేరు: వచ్చే నెల 14 15 తేదీల్లో రైతు సంఘం మహాసభ మోగల్లు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం రాష్ట్ర నాయకులు బి బలరాం తెలిపారు. మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు , ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఏ.ఎస్.రావు నగర్, అలాగే రైతు నేత అమరజీవి వలవల శ్రీరామమూర్తి స్మారక హాలు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ వేదికగా నామకరణం ▶మిగతా 2లో..

'మొంథా'ను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: మొంథా తుపాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని, జిల్లాలో ఎక్కడ కూడా ఏ ఒక్క ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని,తుఫాను దృష్ట్యా కార్తీక మాసం సందర్భంగా పేరుపాలెం బీచ్ లో భక్తుల సముద్ర స్నానాలకు అనుమతి లేదని, జిల్లా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు 08816 - 299219 నిరంతరం పనిచేస్తుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ చదలవాడ నాగరాణి " మొంథా తుఫాన్" ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకునే సన్నద్ధత ఏర్పాట్లపై రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుపాను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలన్నారు. రేపటి నుండి మూడు రోజులు పాటు జిల్లాలో భారీగా వర్షాలు కురియనున్న దృష్ట్యా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాను తీవ్రత దృష్ట్యా జిల్లాలో ఎక్కడ ప్రాణ, ఆస్తి జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వ ▶మిగతా 2లో..

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ❑ ఏలూరు జిల్లాలో 'మొంథా తుఫాన్' ప్రభావం....
- ❑ 28న జిల్లాలో తీవ్రమైన గాలులు,భారీ వర్షాలు ఉండే అవకాశం
- ❑ జిల్లాకు రానున్న ఎస్డీఆర్ఎఫ్ బలగాలు
- ❑ గోదావరి నదిలోనికి పర్యాటక లాంచీలను నిలిపివేయాలి
- ❑ మండలాలలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు...
- ❑ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో 'మొంథా తుఫాన్'ప్రభావంతో ఈనెల 27 నుండి 29వ తేదీ వరకు తీవ్రగాలులు, భారీ వర్షాల కారణంగా హోర్డింగ్ లు కూలే ప్రమాదం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో వాటి కారణంగా ప్రాణ నష్టం జరగకుండా తగు చర్యలు తీసు కోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. తుఫాన్ తీవ్రతపై జిల్లా యంత్రాంగం తీసుకోవలసిన ▶మిగతా 2లో..

తుపాను ప్రభావంపై విస్తృతంగా ప్రచారం చేయాలి

కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

విశాలాంధ్ర - కాట్రేనికోన : తుఫాను ప్రభావంపై తీర గ్రామాలలో దండోరా, మైక్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సూచించారు. ఆదివారం మండల పరిది లోని బలుసుతిప్ప గ్రామంలో బహుళ ప్రయోజన తుఫాన్ ఆశ్రమ భవనాన్ని ఆయన సంద ర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పునరావాస కేంద్రాన్ని అత్యంత పరిశుభ్రంగా ఉండేటట్లు తీర్చిదిద్దాలన్నారు. తుఫాను పునరావాస కేంద్రంలోని వివిధ భాగాల ముంపు బాధితుల తాత్కాలిక నివాసానికి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. తుఫాను పునరావాస కేంద్రం తుఫాను, వరదల వల్ల నివాసాలు కోల్పో యిన ముంపు బాధితులకు తాత్కాలిక వసతి ఆహార, భద్రత, ఆరోగ్య సేవలు అందించి అన్ని విధాల ఆదుకునే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రవి కిరణ్, ప్రత్యేక అధికారి జి మమ్మీ, డిప్యూటీ, ఎంపిడిఓ ఎన్ శంకర్ నారాయణ, ఆర్ఐ విశ్వనాథ్, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ రెవెన్యూ అధికారి నాగలక్ష్మి, నాగేంద్ర, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

ముందస్తు జాగ్రత్త చర్యలపై జిల్లా ఎస్పీతో కలిసి ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ తోఫాన్ సమయంలో 120 కిలోమీటర్ల వేగంతో తీవ్రగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని,దీని కారణంగా హొర్డింగ్ లు, ఆస్బెస్టాస్ రేకులు,ఐరన్ రేకులు ఎగిరిపోయి అవకాశం ఉందని,ప్రజలు అప్రమత్తం ఉండాలన్నారు. తుఫాన్ పరిస్థితి దృష్ట్యా జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేట్ విద్యా సంస్థలకు,కళాశాలలు, అంగన్వాడీలకు ఈనెల 27,28 తేదీలలో సెలవు ప్రకటించడమైందని,ప్రైవేట్ విద్యా సంస్థలలో స్టడీ అవర్స్ వంటివి నిర్వహించకుండా విద్యా శాఖ అధికారులు పరిశీలించాలన్నారు.గోదావరి నదిలోని పర్యాటక లాంచీలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు.అన్ని మండల,డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ నెంబర్ 9491041419, టోల్ ఫ్రీ నెంబర్ 18002331077 లకు ఫోన్ చేసి ప్రజలు తుఫాన్ పరిస్థితి తెలుసుకోవచ్చని,అవసరమైన సహాయం పొందవచ్చన్నారు.తుఫాన్ సమయంలో చెట్లు కూలి రవాణా సౌకర్యాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా వెంటనే చెట్లు తొలగించేలా అధికారులు చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. తుఫాన్ సమయంలో ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు ప్రతీ గ్రామానికి ఒక నోడల్ అధికారిని నియమించాలని,శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లల్లోని వృద్ధులను, లోతట్టు ప్రాంతాల ప్రజలను ఆదివారం రాత్రి నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.నదులు వాగులలోకి ప్రజలు వెళ్లకుండా చూడాలని, కల్వర్టులు,కాజ్ వేలు,వాగులను ప్రజలు దాటకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయడంతోపాటు,ఆ ప్రదేశాలలో సిబ్బందిని నియమించి పర్యవేక్షించాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు. తుఫాన్ తీరం దాటే సమయంలో తీవ్రమైన గాలులు వీస్తాయని, ప్రజలు ఇంటినుండి బయటకు రావద్దన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో డ్రైన్లలో వరద నీరు చేరి నివాసిత ప్రాంతాలు ముంపునకు గురికాకుండా డ్రైన్లలో మురుగును వెంటనే తొలగించాలన్నారు.తీవ్రమైన గాలులు సమయంలో విద్యుత్ స్తంభాలు కూలే అవకాశం ఉన్నందున, విద్యుత్ సంస్థ అధికారులు తక్షణమే చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని, జిల్లా,డివిజన్ స్థాయిలో విద్యుత్ సంస్థ కంట్రోల్ రూంలు ఏర్పాటుచేయాలన్నారు.తుఫాన్ సహాయక కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జనరేటర్ లను ఏర్పాటు చేయాలన్నారు. సెల్ ఫోన్ టవర్ల వద్ద సెల్ఫోన్ నెట్వర్క్ కు అంతరాయం లేకుండా జనరేటర్ లు ఏర్పాటుచేయాలని, వాటికి అవసరమైన డీజిల్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. తుఫాన్ పునరావాస కార్యక్రమాలకు రాష్ట్రం నుండి ఎస్డిఆర్ఎఫ్ బలగాలు జిల్లాకు విచ్చేస్తున్నాయని కలెక్టర్ వెట్రిసెల్వి తెలియజేసారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్ మాట్లాడుతూ మండల స్థాయిలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటుచేయడం జరిగిందని, ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు పోలీసు సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీఓలు అచ్యుత్ అంబరీష్, రమణ,తహసీల్దార్లు,ఎంపిడిఓలు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొంథా తుపాను

(మొదటి పేజీ తరువాయి)

మట్టి ఇల్లు, పాతబడిన ఇళ్లు బలహీనంగా ఉన్న ఇల్లు పడిపోయే అవకాశం ఉందన్నారు. అటువంటి ఇల్లతో సహా లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలలోని సహాయక శిబిరాలకు తరలించాలన్నారు. బాలింతలు చంటి బిడ్డ తల్లులు వృద్ధులను సమీప ఆసుపత్రులకు ముందుగానే తరలించాలని ఆయన సూచించారు. ఆసుపత్రులలో డాక్టర్లకు ప్రత్యేక డ్యూటీ వేసి మందులు సిద్ధంగా ఉంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. 108, 104 వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ సిలిండర్లు అన్ని ముందుగానే సమకూర్చి పెట్టుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాలకు అవసరమైన కాయగూరలు, నిత్యావసర వస్తువులు, ఇతర సామాగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. కోతకు వచ్చిన పంటలను రెండు మూడు రోజులు కోయకుండా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా సహాయక శిబిరాలను గుర్తించాలని, ఏయే ప్రాంత ప్రజలను ఎక్కడికి తరలించాలో కూడా జాబితా ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్ఓ జె వెంకట్రావు, ఇతర జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

మొంథాను సమర్ధవంతంగా ఎదుర్కొవాలి

ముందస్తుగా నరసాపురం డివిజన్లో 10, తాడేపల్లిగూడెం డివిజన్లో 8, భీమవరం డివిజన్లో 10 పునరావాస కేంద్రాలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. తుఫాను తీవ్రత, భారీ వర్షాల దృష్ట్యా మరిన్ని పునరావాస కేంద్రాలు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల వద్ద త్రాగునీరు, భోజన సౌకర్యం తోపాటు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలలో రాబోయే వారం రోజులకు సరిపడా నిత్యవసర వస్తువులను ఆయా ప్రాంతాలలో సిద్ధం చేసి ఉంచాలన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా చూడాలని, ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులను తిరిగి ఒడ్డుకు తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జిల్లాలో ఉప విద్యుత్ కేంద్రాల వద్ద ముందస్తుగా జనరేటర్లు, డీజిల్ సిద్ధంగా ఉంచుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాల నుండి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు ముందస్తుగా బలహీనంగా ఉన్న కాలువ గట్లు, నదీ పరివాహక ప్రాంతం గట్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. బలమైన ఈదురు గాలులు మూలంగా రోడ్లపై చెట్లు పడిపోతే సత్వరమే వాటిని తొలగించి రవాణాకు ఇబ్బంది లేకుండా చూసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత గ్రామాలలో ప్రజలకు నిత్యవసర సరుకులైన రైస్, షుగర్, పాలు, ఉల్లిపాయలు, కూరగాయలు, వంట నూనెలు కొరత లేకుండా అందుబాటులో ఉండే విధంగా చూడాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక శాఖ బోట్లు, లైఫ్ జాకెట్లు, నిల్వ ఉన్న నీటిని తోడేందుకు మోటార్ ఇంజన్లను సిద్ధంగా ఉంచాలన్నారు భారీ వర్షాల వల్ల నీరు సాఫీగా ప్రవహించేందుకు వీలుగా డ్రైనేజీలను శుభ్రపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. పునరావాస కేంద్రాల వద్ద, హాస్పిటల్స్, మొబైల్ టవర్ల వద్ద విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా ఉండేందుకు జనరేటర్ లను సిద్ధం చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు ఆదేశించారు. పల్లపు ప్రాంతాలలో నీట మునిగిన ఇళ్ల వద్ద నుండి నీరును బయటకు తోడేందుకు మోటార్లు సిద్ధం చేసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. మండల స్థాయి కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తుఫాను తీవ్రతను ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయి ప్రత్యేక అధికారుల సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులు పేరుపాలెం బీచ్ లో సముద్ర స్నానాలు, గోదావరి నదిలో స్నానాలు ఆచరించకుండా తగు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులకు సూచించారు. తుఫాను కు సంబంధి క్షేత్రస్థాయిలో ఏ విధమైన సమస్యలు ఉన్న కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ కు తెలియజేయాలి అన్నారు. తుఫాను కారణంగా వాతావరణ శాఖ రానున్న మూడు రోజులలో భారీ వర్షాల హెచ్చరికల చేసిన నేపథ్యంలో ప్రజలు, అధికార యంత్రాంగం అప్రమత్తతతో పూర్తి సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గూగుల్ మీట్లో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, సిపిఓ కే.శ్రీనివాసరావు, డీఎస్ఓ ఎన్.సరోజ, జిల్లాలోని రెవెన్యూ డివిజన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తాసిల్దార్లు, ఎండిఓలు పాల్గొన్నారు.

తుఫాన్ తీరం దాటేవరకు సెలవులు రద్దు

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : మొంథా తుఫాను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపుతుందనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఉభయ గోదావరి జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో పూర్తిస్థాయి సన్నద్ధ చర్యలు తీసుకుంది. ఈ నెల 27వ తేదీన తుఫాను తీవ్ర తుఫానుగా మారి 28వ తేదీ అర్ధరాత్రి మచిలీపట్నం- కళింగపట్నం మధ్య కాకినాడకు సమీపంలో తీరం దాటే అవకాశాలు ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రకృతి విపత్తును ఎదుర్కొనేందుకు అధికారులు సంసిద్ధులయ్యారు. ఇందులో భాగంగానే లోతట్టు ప్రాంతాలు, వర్షాభావ ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఏడాదిలో వచ్చిన అన్ని తుఫాను కంటే ఈ ముంతా తుఫాను మరింత బలమైనదని హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వం సైతం ఆయా జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించి స్వీయ పర్యవేక్షణ చేపట్టింది. ఏలూరు జిల్లాకు కార్తిలాల్ దండే ప్రత్యేక అధికారిగా నియమించగా పశ్చిమగోదావరి జిల్లాకు ప్రసన్న వెంకటేష్ ను ప్రత్యేక అధికారిగా ప్రభుత్వం నియమించింది. వీరి ఆధ్వర్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొని సాధ్యమైనంత మేర ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించేందుకు ప్రణాళికలు రూపొందించి ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. తుఫాను ప్రభావం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపై అధికంగా ఉండే అవకాశాలు ఉండడంతో ఈనెల 27, 28 తేదీల్లో ఉమ్మడి పశ్చిమలోని విద్యాసంస్థలు, కళాశాలకు, అంగన్వాడీ కేంద్రాలకు కలెక్టర్లు సెలవు ప్రకటించారు. అదేవిధంగా తుఫాను విధులకు హాజరయ్యేందుకు సెలవులో ఉన్న అధికారులు, సిబ్బంది వెనక్కి రావాలని కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా తుఫాను తీరం దాటే వరకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మొంథా తుఫాను ప్రభావంతో 90 కిలోమీటర్ల నుండి 120 కిలోమీటర్ల మేర గాలి వేగం వీస్తుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీనివల్ల ఆస్తి నష్టం అధికంగా జరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పవచ్చు. అందువల్ల తుఫాను సమయంలో పైన సూచించిన ప్రమాదాలు అధికంగా సంభవించే అవకాశాలు ఉండడంతో ప్రజలు అప్రమత్తతో మెలగాల్సిన అవసరం ఉంది. తుఫాను ప్రభావంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రెండు రోజులు పాటు నిర్విరామంగా భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో ఈ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిస్తే ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు, పశ్చిమగోదావరి జిల్లాలోని ఆచంట, సిద్ధాంతం, మొగల్తూరు, నరసాపురం మండలాల్లో లోతట్టు గ్రామాలు జలమయమయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో కలెక్టర్లు ఈ ప్రాంతాల్లో ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టారు. అదేవిధంగా వరద ప్రభావం చూపితే ఏలూరు జిల్లాలోని కొల్లేరుకు భారీగా వరద నీరు చేరే అవకాశం ఉండడంతో పెదఎడ్లగాడి గ్రామం వద్ద వరద నీరు ప్రవాహనికి ఇబ్బంది లేకుండా ఉప్పుటేరు ద్వారా సముద్రంలో కలిసే విధంగా గుర్రపు డెక్కను అధికారులు ఇప్పటికే తొలగించారు. అదేవిధంగా ప్రజలు కూడా 27, 28 తేదీల్లో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

14,15 తేదీల్లో రైతు సంఘం జిల్లా మహాసభ

(మొదటి పేజీ తరువాయి)

చేసామన్నారు. దీనిలో ఈ మహాసభ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత మూడేళ్ల నుంచి రైతులు సమస్యలపై జరిగిన ఉద్యమాలను సమీక్షించుకుని రాబోయే మూడేళ్ల కాలంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై రూపకల్పన చేయనున్నామని తెలిపారు.దేశానికి తిండి అందిస్తు చెమటోడ్చి పంటలు పండిస్తున్న రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు రాష్ట్రంలో షుమారు 60 శాతం మంది వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉన్నారన్నారు.. కాని రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదన్నారు.. ప్రభుత్వాలు ఎరువులు, పురుగుమందులు, డీజిల్. పెట్రోలు, కరెంటు ఛార్జీలు రకరకాల పన్నులు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచుతున్నాయన్నారు హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్. స్వామినాథన్ పంట ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50శాతం కలిపి ధర నిర్ణయించాలన్నారు. పాలకులు అంగీకరించారని గుర్తు చేశారు . కాని అమలు చేయడంలేదన్నారు.. కేరళ వామపక్ష ప్రభుత్వ వరి. పంటకు రూ. 600లు అదనంగా కలిపి క్వింటాలకు రూ. 3000లు చెల్లిస్తుందన్నారు. జిల్లాలో స్వాతంత్ర్య సమరయోధులు ఉద్దరాజురామం, కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి లాంటి వారు రైతు సంఘం ప్రారంభించారన్నారు.. వారి స్ఫూర్తితో పనిచేస్తోందన్నారు. సాగునీరు, గిట్టుబాటు ధరలు, పంట ఋణాలు, నష్టపరిహారాలు, ఇన్సూరెన్స్, యూరియా కోసం, ఎరువులు, పురుగుమందులు, పెట్రోలు, డీజిల్ కరెంటు ఛార్జీల తగ్గింపు రైతుల మోటార్లకు మీటర్లు, ఇళ్ళకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళనలు, ఉద్యమాలు చేస్తోందన్నారు. జిల్లాలో సంఘం, ఉద్యమం బలపడితే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.. రైతులకు మరింత మేలు జరుగుతుందన్నారు.. విప్లవ వీరుడు అల్లూరి, అణుశక్తి సూరీడు: ఏ. ఎస్.రావు లాంటి మహోన్నత వ్యక్తుల్ని కన్న గడ్డ మొగల్లు గ్రామం.

ఈ చారిత్రాత్మక గ్రామంలో జరుగుతున్న రైతు సంఘం జిల్లా మహాసభలకు అన్ని మండలాల నుండి రైతుసమస్యలపై పట్టుదలతో అంకితభావంతో అంతా విచ్చేసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు భవిష్యత్ లో రైతాంగ సమస్యలపై రైతు ఉద్యమాలు నిర్వహించేందుకు పెద్దలు, ప్రముఖులు, దాతలు, రైతు శ్రేయోభిలాషులు, అన్ని పంటల రైతాంగం, వర్తక-వాణిజ్య వర్గాలు, వివిధ సంస్థలు, ఉద్యోగులు అందరూ తమ సహాయ సహకారాలు, అందించాలని విజ్ఞప్తి చేశారు.

నల్లదిబ్బ రోడ్డు పనులకు త్వరలో మోక్షం...

రోడ్డు పరిస్థితిని పరిశీలించిన ఎంపీ పుట్టా మహేష్

విశాలాంధ్ర -ఏలూరు ప్రతినిధి: ఏలూరు పట్టణంలో అధ్వానంగా మారిన నల్లదిబ్బ-సాయినగర్ రోడ్డును త్వరలోనే బీటీ రోడ్డుగా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హామీ ఇచ్చారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ(చంటి)తో కలిసి స్థానిక వన్ టౌన్ 1,2 డివిజన్లో పరిధిలో నల్లదిబ్బ రోడ్డు, సాయి నగర్ ఏరియాలోని రోడ్లను పరిశీలించారు. కిలోమీటర్ పైగా నడుచుకుంటూ వెళ్లి రోడ్డు పరిస్థితిని పూర్తిగా పరిశీలించిన ఎంపీ,రూ.50 లక్షల అంచనా వ్యయంతో బీటీ రోడ్డు పనులకు ప్రతిపాదనలు కూడా తయారు చేశామని,త్వరలోనే రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు,ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్,కో ఆప్షన్ సభ్యులు ఎస్ ఎం ఆర్ పెదబాబు, అగ్రికల్చర్ కోపరేటివ్ సొసైటీ బ్యాంక్ చైర్మన్ అమరావతి అశోక్,టిడిపి నాయకులు బొద్దాని శ్రీనివాస్,కార్పొరేటర్ జున్నూరి కనక నరసింహారావు, డివిజన్ ఇంచార్జ్ లు తీయాల రవి ప్రసాద్, ఇతర స్థానిక నేతలు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యా సంస్థలకు సెలవు

విశాలాంధ్ర -భీమవరం: మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, అంగన్వాడీలకు సోమ, మంగళ వారాల్లో సెలవు దినాలుగా ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆదేశాలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర -జీలుగుమిల్లిబీ: బంగాళాఖాతంలో ఏర్పడిన మొంత తుఫాన్ 27 ,28 ,29 తేదీల్లో తీరం దాటి అవకాశం ఉన్నందున వాతావరణ శాఖ హెచ్చరికల వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, కూలీలు, సాధారణ ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యేల భేటీ

విశాలాంధ్ర-జీలుగుమిల్లిబీ: పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నీ బర్రింకలపాడు లో ఆదివారం ఇంటి వద్ద ,ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కలిశారు .ఎమ్మెల్యే ధర్మరాజుని బాలరాజు సాదరంగా ఆహ్వానించి స్నేహపూర్వకంగా పలకరించారు. ఇరువురు నాయకులు ప్రాంతీయ అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యేల తమ నియోజకవర్గాల మధ్య పరస్పర సహకారం కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జీలుగుమిల్లి సొసైటీ చైర్ పర్సన్ సరిపల్లి సత్యనారాయణ రాజులు ఉన్నారు.

ఘనంగా కార్తీక వనసమారాధన

విశాలాంధ్ర-భీమవరం,భీమవరం టౌన్: కార్తీక వన సమారాధన అనేది కార్తీక మాసంలో బంధుమిత్రులతో కలిసి మెలసి ఉండే ఒక పండుగ అని, ఇది ప్రకృతితో మనిషికి ఉన్న బంధాన్ని గుర్తుచేసే ఒక ఆచారమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మార్కెట్ యార్డులో ఆదివారం శ్రీవాసవి ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటువంటి కార్తీక వన సమారాధనకు ప్రతి ఏడాది నిర్వహించడం శుభ పరిణామమని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అంజిబాబు ను సేవా సంఘం సభ్యులు సత్కరించారు. శ్రీవాసవి ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన సేవా సంఘం ప్రెసిడెంట్ చక్కా సుబ్బారావు, సెక్రటరీ టంగుటూరి అది వెంకట నారాయణ, ఇడపలపాటి రామ సుధాకర్, పరుచూరి నాగేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నందాదేవి ట్రెక్కింగ్ విజయవంతం

విశాలాంధ్ర -భీమవరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నందాదేవి పర్వతారోహణను భీమవరం యూనిట్ సభ్యులు పెన్మత్స రవిరాజు, కట్టా సత్య వర ప్రసాద్ విజయవంతంగా పూర్తి చేసుకుని భీమవరం చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు భీమవరం మీడియాతో మాట్లాడుతూ తమతో పాటు విశాఖపట్నం నుండి ముగ్గురు బెంగళూరు నుండి ఒక్కరు, మొత్తం ఆరుగురు సభ్యుల బృందం ఈ నెల 6 నుండి 15 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం లో కథ గుడెం నుండి ప్రత్యేక వాహనం లో బయలు దేరి నందాదేవి పర్వతం బేస్ క్యాంపు చేరుకున్నామన్నారు. దేశంలో అత్యంత ఎత్తైన ఈ హిమాలయ పర్వత శిఖరాన్ని 40 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రాష్ట్రము నుండి నందాదేవి పర్వతాన్ని విజయవంతంగా అధిరోహించి చరిత్రలో నిలిచామని వారు సంతోషం వెలిబుచ్చారు. నందా దేవి ట్రెక్కింగ్ చాలా కఠినమైన, సవాలుతో కూడుకున్న ట్రెక్కింగని వారు వివరించారు. నందా దేవి పవిత్ర ప్రాంతమని అందువల్ల ప్రవేశం కఠినమైన నిబంధనలకు లోబడి ఉంటుందని, 40 ఏళ్ల తర్వాత ఈ ప్రాంతంలో ట్రెక్కింగ్ తిరిగి ప్రారంభమైందని వారు గుర్తు చేశారు. నందా దేవి పర్వత శిఖరం ఎత్తు 7,816 మీటర్లు (25,643 అడుగులు) ఎత్తులో ఉంటుందని, ట్రెక్కింగ్ సాధారణంగా నందా దేవి బేస్ క్యాంప్ 4800 మీ. వరకు ఉంటుంది, దీని పూర్తి శిఖరం ఎత్తు 13,780 అడుగులని వారు తెలిపారు. తమ ట్రెక్కింగ్ లో సమయంలో నందా కోట్, మౌంట్ చంగూచ్, సహలాంగ్ ధురా, నందా భనార్, నందా లపాక్ అనే పర్వతాలు దారిలో కనిపించాయని చాలా అనుభూతి పొందామని వారు పేర్కొన్నారు. నందా దేవి హిమాలయ పర్వత శిఖరం యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం గా గుర్తించబడిందని, నందా దేవి పర్వతం ఆనందాన్ని ఇచ్చే దేవత'గా పరిగణించబడుతుందని, ఉత్తరాఖండ్ పోషక దేవతని వారు వివరించారు. అనంతరం పర్వతారోహకులు పెన్మత్స రవిరాజు, కట్టా సత్య వర ప్రసాద్, రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులు గొట్టుముక్కల శేఖర రాజులను యూత్ హాస్టల్స్ భీమవరం యూనిట్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనిట్ అధ్యక్షులు మంతెన వెంకట లక్ష్మి నర్సింహ సీతా రామరాజు, రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ వి.వి.జె.సోమరాజు, యూనిట్ చైర్మన్ ప్రొఫెసర్ మట్లపూడి సత్యనారాయణ, కార్యదర్శి కటికిరెడ్డి వెంకటరత్నం, కార్యవర్గ సభ్యులు, బోనం పాండురంగారావు, తాళ్లపూడి గాంధీ, జానపాటి మధుసూదనరావు, ప్రసాద్, పేరిచెర్ల లక్ష్మణ వర్మ, జి.వి.సత్యనారాయణరాజు, పెన్మత్స భాస్కర వెంకట సత్యనారాయణ రాజు, జీ.వి.సత్యనారాయణ రాజు, దివ్య కళ తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: పట్టణంలో 5వ వార్డు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజాఉద్యమం లో భాగంగా స్థానికులతో సంతకాలు చేయించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో విద్య, వైద్యం, వ్యవసాయ, మహిళా సాధికారత రంగాలకు అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. పేద విద్యార్థులకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసే విధంగా వైఎస్ఆర్సిపి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మెడికల్ కాలేజీలను పూర్తిగా ప్రైవేటీకరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. కులుకులూరి ధర్మ రాజు, ముప్పిడి సంపత్ కుమార్, బోలెం రమణ, పాలూరి శివ, తాగారాంపూడి మురళి కృష్ణ, సారిపల్లి రమణ, చిట్టా శ్రీను, పట్నాల అప్పారావు, బొద్దని శ్రీనివాస్, వైస్సార్సీపీ 6వార్డ్ ఇంచార్జ్ షేక్ మస్తాన్ వలి, జద్దు హరిబాబు, రెడ్డి సూరిబాబు, హాసన్ బీబీ. వీరయ్య, కట్ట నాగరాజు, పాల్గొన్నారు.

విజయ్‌కు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి స్వచ్ఛంద సేవా సంస్థల వారు ముందుకు రావాలని మానవతా సంస్థ అధ్యక్షులు మందపాటి. రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన ముప్పిడి విజయ్ ఇటీవల కాలంలో అనారోగ్యానికి గురి కావడంతో అతని వైద్య ఖర్చు నిమిత్తం రూ.3000 లు అందజేశారు. స్వచ్ఛంద సేవా సంస్థల వారు చేస్తున్న సేవలకు ఎంతోమంది కి లబ్ధి చేకూరుతుందని , ఆపదలో ఉన్న మమ్ములను ఆదుకోవడానికి ముందుకు వచ్చిన మానవతా సంస్థ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు విజయ్ కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్క బాబి, రాము, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, వి ఎస్ ఎన్ స్వామి, షేక్ బాషా, తీగిరిపల్లి చంటి, మోహన్ రావు, రమేష్, మట్టే శ్రీను, ఎస్ బి జి శేఖర్, నిడదవోలు. రామారావు పాల్గొన్నారు.

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తం ఉండాలి

ఎమ్మెల్సీ జయ మంగళ

విశాలాంధ్ర - కలిదిండి : బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను కాకినాడ పరిసరాల్లో తీరాన్ని దాటే అవకాశం ఉన్న నేపథ్యంలో కైకలూరు నియోజకవర్గంలో ప్రజలను అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ జయమంగళ. వెంకటరమణ కోరారు. ఆదివారం మండలంలో పెదపుట్లపూడి, అప్పారావుపేట, పెదలంక పల్లిపాలెం, మట్టగుంట, కొండంగి పల్లిపాలెం గ్రామాలలో పర్యటించిన ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల ప్రజలకు మొంథా తుపాను ప్రభావం రాబోయే 3 రోజులు చాలా తీవ్రంగా ఉంటుందని,ముప్పు ముంచుకొస్తోందని, జాగ్రత్తలు తీసుకోవాలని అప్రమత్తం చేశారు. పిల్లల భద్రత దృష్ట్యా ఈనెల 30వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ భరోసా ఇచ్చారు. కూటమి నేతలు బెల్లంకొండ. వెంకన్న బాబు, ముద్దం. భోగేశ్వరరావు, దున్న. బోగేశ్వరరావు ,రెడ్డి శ్రీనివాస్ చక్రవర్తి, ఆంద్రాజు. శీను, కొల్లాటి. కొత్త రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు ఏకం కావాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆర్యవైశ్యులంతా ఏకం కావాలి అని కొయ్యలగూడెం పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మాటూరి సుధీర్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఆదివారం కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, యువతులకు సాంప్రదాయ వస్త్రధారణ పోటీలు, విద్యార్థులకు ఆటల పోటీలు, నిర్వహించి, పోటీలలో గెలుపొందిన వారికి గౌరవ అతిథులుగా విచ్చేసిన పెద్దల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. పంచాయతీ ప్రథమ సర్పంచ్ స్వర్గీయ కొల్లూరి విశ్వేశ్వరరావును స్మరించుకుంటూ కొద్ది నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కంభంపాటి సాయి కృష్ణ, సొలస సుధాకర్, ఉమామహేశ్వరరావులు పాల్గొన్నారు.

ఉచిత మెగా ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-చింతలపూడి: చింతలపూడి లయన్స్ క్లబ్ సన్షైన్ హాస్పిటల్,సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం కొత్త బస్టాండ్ దగ్గర సన్ లైఫ్ ఆధ్వర్యంలో హాస్పటల్లో ఏర్పాటు చేశారు. సందర్భంగా 400 మందికి కంటి,జనరల్ ,ప్రసూతి వైద్యం చేయుట జరిగింది. .కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు అడపా శ్రీనివాసరావు, సెక్రటరీ దుగ్గిరాల రామకృష్ణ, అబ్బయ్య, సభ్యులు జల్లిపల్లి రాము,కొత్తపూడి శేషగిరి రావు,గాంధీ,కొనకళ్ళ కేశవరావు, కొనకళ్ళ నెహ్రూ,పొట్టి చక్రధరరావు పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకు ప్రాధాన్యత

మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర - నరసాపురం: కూటమి ప్రభుత్వం లో కష్టపడిన వారికి అందరికీ తగిన ప్రాధాన్యత ఉంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. నరసాపురం అల్లూరి సత్యనారాయణ రాజు సాంస్కృతిక కేంద్రం లో నిర్వహించిన ఎఎంసీ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం మహోత్సవం ఆదివారం నిర్వహించారు. చైర్మన్ గా జక్కం శ్రీమన్నారాయణ, వైస్ చైర్మన్ గా దేశీనీడి లక్ష్మీ గంగాధర్,పలువురు డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి పొత్తూరి రామరాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నారు. ధాన్యం, విక్రయించిన 48గంటలలో రైతులు ఖాతాల్లో కి నిధులు జమ చేస్తున్నామన్నారు. మరో అతిథి నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖను మూత వేశారన్నారు.గత ప్రభుత్వంలో సబ్సిడీపై ఇచ్చే వ్యవసాయ యాంత్రాలను సైతం నిలిపేశారు.ఐదేళ్లలో కాలువలు, డ్రైన్స్ లో ఎక్కడా ఒక్క తట్ట మట్టి తీయలేదు.షట్టర్స్, డోర్స్, లాకులకు మరమ్మత్తుల మాట అటుంచి ఐదేళ్లలో కనీసం గ్రీజ్ కూడా పెట్టలేదన్నారు. ఏడాది కాలంలోనే సూపర్ సిక్స్ హామీల అమలుతో పాటు, రైతులకు అన్నదాత సుఖీభవ కింద 20 వేలు అందిస్తున్నాం.గత ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన రూ.1640 కోట్ల ధాన్యం బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ నూతన పాలకవర్గం రైతులకు అన్ని విధాల అందుబాటులో ఉండాలన్నారు. ఎమ్మెల్సీ పెరబత్తుల రాజశేఖర్, ఎం ఏ షరీఫ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, మాజీ మంత్రి పీతల సుజాత,బీజేపీ అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, సీపీఐ రాష్ట్ర నాయకుడు నెక్కంటి సుబ్బారావు, చాగంటి మురళీ కృష్ణ, కొప్పాడి రవి, కొల్లు పెద్దిరాజు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో డా.చినిమిల్లి సత్యనారాయణ రావు, తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూముల కోసం ఉద్యమం

వ్యవసాయ కార్మిక సంఘం

విశాలాంధ్ర-నూజివీడు: నూజివీడు ప్రాంతంలో పేదలు సాగుచేస్తున్న బంజరు భూములకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక అమర్ భవనంలో అబ్బూరి రంగారవు అధ్యక్షతన జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిత్యం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో వ్యవసాయ కార్మికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నూజివీడు ప్రాంతంలో వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఐ పోరాటంతో పేదలకు దక్కన భూమికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలను విస్మరించి కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే చర్యలు తీసుకుంటుందని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర నాయకులు చలసాని రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రచారం తప్ప ప్రజా సంక్షేమంపై ఏమాత్రం దృష్టి సారించిడం లేదని విమర్శించారు. నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహా, మడుపల్లి సత్యనారాయణ నాగేంద్రరావు, చెంగల వెంకటేశ్వరావు నాయ కులు కూచిపూడి నాగేశ్వరరావు, బూరుగు బాబూరావు, ఆనంద్, రాము, జయరాజు, సుశీల, రాణీ పాల్గొన్నారు.

పునాది దాటక...భవనం పూర్తవ్వక...

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు: స్థానిక వంగాయిగూడెం రోడ్డులోని పంపులు చెరువు వద్ద గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ నిర్మాణం పునాది దశ దాటలేదు.కారణం ఏమిటో తెలీదు గానీ మూడున్నర ఏళ్ల క్రితం ప్రారంభించిన ఈ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.పునాది దశలో ఆగిపోయిన ఈ ప్రాంతం గత కొద్ది కాలంగా అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని స్థానికులు అంటున్నారు. ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో వంగాయ గూడెం కూడా రోడ్డులోని హెడ్ వాటర్ వర్క్స్ లోపల చెరువు వద్ద రూ.111.30 లక్షలతో గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ భవన నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే ఆళ్ల నాని 2022 జనవరి 24 న శంకుస్థాపన చేశారు.భవన

నిర్మాణం పూర్తి చేయడం సంగతి ఎలా ఉన్నా కనీసం ఈ ప్రాంతంలో పంపులు చెరువుకు రక్షణ గోడనైనా పునర్ నిర్మించి అసాంఘిక శక్తుల నుంచి భద్రత కల్పించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.ఈ అంశంపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా అధికారులు అందుబాటులో లేరు.

తుపాను ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక అధికారి సమీక్ష

విశాలాంధ్ర -భీమవరం: మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాకు కేటాయించిన ప్రత్యేక పర్యవేక్షణ అధికారి వి.ప్రసన్న వెంకటేష్ ఆదివారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు. ఆదివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి వి.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో సమావేశమై జిల్లాలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాలు, ముందస్తుగా తీసుకున్న చర్యలపై సమీక్షించారు. సైక్లోన్ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటుచేసి, కలెక్టర్లతో సమన్వయంగా చర్యలు తీసుకుంటారు. దీనిలో భాగంగా జిల్లాకు వి.ప్రసన్న వెంకటేశ్ ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు. అన్ని శాఖల మధ్య రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇంధనం, రోడ్లు భవనాలు, నీటివనరులు, ఆరోగ్యం సమన్వ యంతో పర్యవేక్షిస్తారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఏదైనా సమా చారాన్ని ప్రత్యేక అధికారికి తెలియపరచవలసి ఉంటే ఈ నెంబర్కు 8639541520 సంప్రదించాలని తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - లింగపాలెం : తుఫాను ప్రభావం వల్ల లింగపాలెం మండలంలో వంద కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ సూచించడంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యలలో నిమగ్నమయ్యారు. లింగపాలెం తహసిల్దార్ నజీముల్లాషా తన కార్యాలయంలో ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు.మండల ప్రత్యేకాధికారి సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ విశ్వనాథరెడ్డి టెలికాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులకు సూచనలు చేస్తున్నారు.తహసిల్దార్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు విషయాలపై చర్చించారు. విప్పత్తును ఎదుర్కోటానికి అందరూ సిద్ధంగా ఉండాలని తహసిల్దార్ పిలుపునిచ్చారు. రెవెన్యూ, పంచాయతీ, ఎలక్ట్రికల్,పోలీస్, రహదారులు, వ్యవసాయ శాఖకు చెందిన అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాలలో నివసించేవారు పూరిళ్లల్లో ఉంటే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తహసీల్దార్ సిబ్బందిని ఆదేశించారు. ప్రమాదక రంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, వేలాడుతూ ఉన్న విద్యుత్ వైర్లను ముందుగానే పటిష్ఠ పరచాలని అధికారులను ఆదేశించారు.

పర్యావరణ హితం కోసం మెగా ప్లాంటేషన్

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: పర్యావరణ హితం కోరి తాడేపల్లిగూడెం ఆత్మబంధువులం సేవా సంఘం ,ఏ. బి. ఎఫ్. తలపెట్టిన మెగా ప్లాంటేషన్ కార్యక్రమం ఆదివారం జరిగింది. హార్టికల్చర్ డిపార్టుమెంట్ సూచనతో, కదంబ, రోసియా ,బాదం, గుల్మోహర్, రామా ఫలం, రేలా వంటి 400 రకాలు, కడియం నర్సరీ నుంచి 6 అడుగుల మొక్కలు పిచ్చికల భాస్కర్ ఆర్థిక సహాయం తో కొనుగోలు చేశారు. వెంకటరామన్నగూడెం యూనివర్సిటీ మొదటి గేట్ నుండి ఫోర్ లైన్స్ రోడ్ ముగింపు వరకు ఒక్కొక్క మొక్కకి 5 మీటర్లు దూరంలో ఈ మొక్కలు నాటారు. ఈ మెగా ప్లాంటేషన్ లో హార్టీకల్చరల్ యూనివర్సిటీ, లోటస్ పబ్లిక్ స్కూల్స్ , శశి ఇంజనీరింగ్ కాలేజ్, ఆదిత్య కాలేజ్, తాడేపల్లిగూడెం నిట్, విద్యార్థినీ,విద్యార్థులు200 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చినతాడేపల్లి పిచ్చికల భాస్కర్ , కుందేటి మురళీ కృష్ణ, డాక్టర్ దొరజి , ఉషా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మీకోసం రద్దు

విశాలాంధ్ర -భీమవరం: మొంథా తుపాను నేపథ్యంలో నేడు సోమవారం పిజిఆర్ఎస్ ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆదివారం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ తుపాను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని తెలిపారు. అత్యవసరం అయితే తప్ప 29వ తేదీ వరకు ప్రయాణాలు చేయవద్దని ప్రజలకు కలెక్టర్ సూచించారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

విశాలాంధ్ర-టి నరసాపురం: ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా హెచ్చరించారు. స్థానిక వెంకటేశ్వర ఎరువుల దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేసి ఎరువుల నిల్వలను స్టాక్ రిజిష్టర్ లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులతో ఈ పంట నమోదు పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూరు శాతం ఈ పంట నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ సుబ్బారావు, గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.

పూర్ణచంద్రరావుకు మంత్రి పార్థసారధి పరామర్శ

విశాలాంధ్ర-చాట్రాయి: తెలుగుదేశం పార్టీ కోటపాడు గ్రామ నాయకులు సికేపూర్ సప్లై ఛానల్ నీటి సంఘం అధ్యక్షులు మంచిన పూర్ణచంద్రరావు కిడ్నీ మార్పిడి చేసుకున్న నేపథ్యంలో మంత్రి పరామర్శించారు. మండలం కోటపాడు గ్రామానికి చెందిన మంచినపూర్ణ కిడ్నీ పాడవడం వల్ల చివరన ఆరోగ్యానికి గురయ్యారు ఇటీవల కిడ్నీ మార్పిడి చేయడంతో విజయవాడలోని శ్రీస్వరూప సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కి మంత్రి పరామర్శించారు.

అన్ని మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు

విశాలాంధ్ర -భీమవరం: మెంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలపై అన్ని మండల కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే విదంగా కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామని భీమవరం ఆర్డీఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కార్యాలయంలో 9848413739, 8790731315బీ భీమవరం తహశీల్దార్ కార్యాలయంలో 9491041460, కాళ్ల 9491041456, ఆకివీడు 9491041467, ఉండి 9491041459, పాలకోడేరు 9491041457,గణపవరం 8374751009, వీరవాసరం 9491041458 తహశీల్దార్ కార్యాలయాల్లో ఆయా నెంబర్లలో కంట్రోల్ రూమ్‌లు పనిచేస్తాయని ఆయన వివరించారు

రెవెన్యూ సర్వీసెస్ అధ్యక్షుడిగా రమేష్ కుమార్ ఎన్నిక

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షులుగా కే.రమేష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం ఏలూరులోని రెవెన్యూ భవన్ లో జరిగిన ఎన్నికల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి అధికారికంగా ప్రకటించారు. అదేవిధంగా ఏలూరు జిల్లాకు జరిగిన రెవెన్యూ అసోసియేషన్ ఎన్నికల్లో రమేష్ కుమార్ పానెల్ విజయం సాధించింది. రమేష్ కుమార్ ఏలూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తున్నారు.

లాల్వా డైవర్షన్ పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర - కలిదిండి: లాల్వా కాలువపై తూములు పెట్టి నిర్మించిన డైవర్షన్ కొట్టుకుపోవడంతో కలెక్టర్ వెట్రి సెల్వి పరిశీలించారు. ఆదివారం కలిదిండి నుంచి కైకలూరు వెళ్లే ప్రధాన రహదారిలలో ఉన్న లాల్వ కాలువ వంతెను ఆమె పరిశీలించారు. మొంథా తుఫాను కారణంగా పనులకు ఆటంకం ఏర్పడుతుందని, పాఠశాలల విద్యార్థులు, కాలేజీల విద్యార్థులు, పాదచారులు,చిన్న వాహనాలకు అంతరాయం లేకుండా బేయిలి బ్రిడ్జిని నిర్మాణం చేపడతామన్నారు. ఎమ్మెల్సీ జయ మంగళ. వెంకటరమణ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఆంద్రాజు. శ్రీనివాసరావు, కోరుకొల్లు డిసి పేటేటి. సత్యనారాయణ, అమజాల. బాబులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హక్కుల పరిరక్షణకు సమితి కృషి

విశాలాంధ్ర-నిడదవోలు : రాష్ట్రంలో షెడ్యూల్ కులాల వారిపై దాడులు పెరిగిపోయాయని వాటిని అరికట్టి,షెడ్యూలు కులాల హక్కుల పరిరక్షణకు సమితి కృషి చేస్తుందని షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు కే చెన్నకేశవరావు అన్నారు. నిడదవోలు గాంధీ నగర్‌లో నిర్మించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ భవనాన్ని ఆయన సందర్శించారు. షెడ్యూల్ కులాలకు సంబంధించిన ఇటువంటి భవనం రాష్ట్రంలో ఎక్కడా లేదని భవన నిర్మాణానికి కృషి చేసిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు, అంబేద్కర్ ఆలోచన విధానాన్ని బోధించేందుకు ఈ భవన నిర్మాణం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. అనంతరం భవన అభివృద్ధి కమిటీ సభ్యులు చెన్నకేశవ రావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భవన అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ ఎన్ వెంకటేశ్వరరావు, న్యాయవాది నక్కా వెంకటేశ్వరరావు, కోశాధికారి ఈ.సత్యనారాయణ, నత్తా రాజు, శేఖర్,సంగాలు, వసంత రాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలన

విశాలాంధ్ర-రాజమండ్రి సిటీ : నగరాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచేం దుకుగాను ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. ఆదివారం తెల్లవారుజామున వీఎల్ పురం పరిసర ప్రాంతాలలో ఆయన పర్యటించారు. తొలుత స్థానిక శానిటరీ ఇన్స్ పెక్టర్ కార్యాలయంలో ఘన వ్యర్థాలతో తయారుచేసిన అందమైన కళాకృతులను పరిశీలించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికుల హాజరుపట్టికను తనిఖీ చేసి, రోజూ కార్మికులు ఎన్ని గంటలకు హాజరవుతున్నారని ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. మురుగునీరు నిల్వ ఉన్న చోట్ల దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులకు కావలసిన పనిముట్లు అందజేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట నగర ఆరోగ్యశాఖాధికారి వినూత్న, ఇతర అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

వృద్ధురాలు మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో కాటవరం గ్రామ పంచాయతీ పరిధిలో తెలగారెడ్డి నాగమణి వయస్సు 90 అక్టోబర్ 19న కనిపించకుండా పోయింది. అయితే దీనిపై ఆమె మనవడు బ్రహ్మం అక్టోబర్ 20వ తేదీన పోలీస్ స్టేషన్ లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆదివారం సాయంత్రం కాటవరం గ్రామంలో మొండి పుంత చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికులు సమాచారం మేరకు కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకొని మృతి చెందింది నాగమణే అని గుర్తించారు. దీనితో కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్థానికులు సమా చారం మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

భాష్యం స్కూల్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-దేవరపల్లి : దేవరపల్లి భాష్యం స్కూల్ కు చెందిన ఆరుగురు విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు పురుషోత్తపల్లి, నిడదవోలు నందు నిర్వహించిన కొవ్వూరు డివిజన్ స్థాయి చెస్ మరియు అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక య్యారని భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ పి పేరయ్య నాయుడు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు అండర్ 17 చెస్ పి రఘు ప్రబోధ్ వర్మ మొదటి స్థానం, ఎస్ జస్వంత్ రెండవ స్థానం, అండర్ 14 చెస్ ఎస్ రచన శాన్వి రెండవ స్థానం, రన్నింగ్ అండర్ 17 ఎం దిగ్విజయ్ మొదటి స్థానం, షాట్ పుట్ అండర్ 17 పి. చరణ్ అక్షయ్ కుమార్ రెండవ స్థానం, షాట్ పుట్ అండర్ 14 ఎన్ లోకేష్ మొదటి స్థానం లను భాష్యం స్కూల్స్ జోనల్ ఇన్చార్జ్ వి ఆంజనేయులు,చాంప్స్ ప్రిన్సిపల్ షేక్ షభానా, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

మండల అధికారులు తుఫాను పై సమీక్ష సమావేశం

విశాలాంధ్ర-అనపర్తి : అనపర్తి మండల ప్రజలంతా అధికారులు సలహాలు సూచనలు పాటించాలని, రాబోయే తుఫానుపై అప్రమత్తంగా ఉండాలని అన పర్తి మండలం అభివృద్ధి అధికారి మండ రామ కృష్ణారెడ్డి తెలిపారు.ఈ నెల 27 28 29 తేదీలలో తుఫాను ముప్పు పొంచి ఉండటంతో అనపర్తి మం డల అధికారులు ముందస్తుగా ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనపర్తి ఎంపీడీవో కార్యా లయంలో ఎంపీడీవో మండ రామకృష్ణారెడ్డి, తహసీ ల్దార్ అనిల్, ప్రత్యేక అధికారి నాగ లత, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి లు మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మొంథ తుఫాన్ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం 27, 28, 29 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర గాలులతో కూడిన భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిం చింది. రాబోయే మూడు రోజుల్లో ప్రజలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పంచాయతీ కార్యదర్శులు గ్రామ రెవెన్యూ అధికారులు, సచివా లయ సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో సహా యక చర్యల కోసం సిద్ధంగా ఉండాలని తెలిపారు. విద్యుత్, రోడ్లు, తాగునీరు వంటి అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవడా నికి సంబంధిత శాఖలను సన్నద్ధం చేయాలని ఆయన అన్నారు. డివిజనల్ పంచాయతీ అధికారి నాగ లత మాట్లాడుతూ ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రజలు కూడా అధికారుల సూచనలను తప్పక పాటించాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, అనవసర ప్రయా ణాలు మానుకోవాలని తెలిపారు. పెద్ద పెద్ద చెట్లు క్రింద, బహిరంగ ప్రదేశాలలో పశువులను కట్టొద్దని హెచ్చరించారు. గ్రామాలలో ఫ్లెక్స్, ఇతర హోల్డింగ్‌లు తక్షణం విప్పేయలేని ఆదేశిం చారు. శిథిలావస్థకు చేరిన బిల్డింగ్ లలో ఈ మూడు రోజులు ఆవాసాలు ఖాళీ చేయాలని తెలిపారు. ట్రైన్లలో ఫుడ్‌కిటీతలు ఎప్పటికప్పుడు తీసివేయాలని ఆదేశిం చారు. కార్యక్రమంలో మండలంలోని రెవెన్యూ, సచివాలయం, వ్యవసాయ, పోలీసు, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తిగా నిలిచేలా సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర-రాజమండ్రి సిటీ : తన పుట్టిన రోజు ఆడంబరంగా కాకుండా పది మందికి స్ఫూర్తిగా నిలిచేలా సేవా కార్యక్రమాలు చేపట్టామని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. ఆ దిశగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టిన నాయకులను ఆయన అభినందించారు. ఎమ్మెల్యే పదవి హోదా కాదని ఇది ఒక బాధ్యత అని ఆయన అన్నారు. తిలక్ రోడ్డులోని తన నివాసం వద్ద ఆదివారం ఉదయం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భవాని చారిటబుల్ ట్రస్ట్ (బిసిటి) తరపున 11 మందికి విద్య, వైద్యం నిమిత్తం రూ. 70 వేలు, ముగ్గురు చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి 4 వీల్ చైర్లు బహూకరిం చారు.36 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. అలాగే నగర టీడీపీ ఆధ్వర్యంలో 1,000 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఇంత వరకు రాజమండ్రి సిటీ నియోజకవర్గంలో రూ.3 కోట్ల వరకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందచేశామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర- తాళ్లపూడి : తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో గేదెలు అంతుచిక్కని వ్యాధికి గుర వ్వటం కొనసాగుతోంది. అలాగే చనిపోతున్నాయి. నేటి వరకు సుమారు 48 గేదెలు చనిపోవడం జరిగిందని, జరిగిన సంఘటనలో బాధితులకు ఇప్పటి వరకు ఎటువంటి సహాయం అందించలేదని గ్రామ ఉప సర్పంచ్ తోట రామకృష్ణ ఆరోపించారు. గేదెలకు వైద్యం చేసిన నిన్నటి రోజున ఎండపల్లి నాగేశ్వరావు, కేతవరపు సాయి రామ్, పోలినాటి శ్రీనివాసరావు లకు చెందిన గేదెలు ఇటీవల మృతి చెందడం చాలా బాధాకరమని, దీనిపై ప్రభుత్వం తక్షణ స్పందించి పాడి రైతుల కుటుంబాలను ఆదుకోవాలి అని కోరారు.

ఓట్ల చోరీ తో గద్దెనెక్కిన బీజేపీ

విశాలాంధ్ర-నిడదవోలు : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓట్ల చోరీతో గద్దె నెక్కిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మేడవరపు భద్రం దొర అన్నారు.పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశం మేరకు నిడదవోలు మండలం సమిశ్ర గూడెం బాబు జగ్జీవన్ రావు విగ్రహం వద్ద, అట్లపాడు గ్రామంలో మేడవరపు భద్రం దొర ఆధ్వర్యంలో బిజెపి ఓట్లు చోరీ పై అవగాహన సదస్సు నిర్వహిం చారు.ఈ సందర్భంగా భద్రం దొర మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దొంగ ఓట్లతో ఎట్లా గద్దెనేక్కిందో ప్రజలకి వివరించారు. రాబోయే ఎన్నికల్లో దేశానికి రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి, రాష్ట్రా నికి తొలి మహిళా ముఖ్యమంత్రిగా షర్మిలా రెడ్డి అవుతారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-రాజ మండ్రి సిటీ : జిల్లాలోని వివిధ స్కూళ్ళు, కాలేజీలు మరియు బాలికల హాస్టల్స్‌లో మహిళలపై జరుగుతున్న నేరాలపై సౌత్ జోన్ డీఎస్పీ శ్రీమతి ఎస్. భవ్య కిషోర్, ఇన్‌స్పెక్టర్ కె. మంగాదేవి ఆధ్వర్యంలో శక్తి టీంలు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్. భవ్యకిషోర్ మహిళలు బాలికలపై జరిగే లైంగిక దాడులపై వారిలో విస్తృత అవగాహన కల్పించారు. అదేవిధంగా మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ గురించి, సైబర్ నేరాల గురించి, సోషల్ మీడియా నష్టాల గురించి, పోక్సోచట్టం, శక్తియాప్ ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు. మహిళలంతా శక్తి యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలని, ఎవరికైనా ఎటువంటి ఆపద వచ్చినా, ఏ సమయంలో నైనా శక్తి యాప్ ద్వారా జిల్లా పోలీసుల సహాయం కోరవచ్చని ఆమె తెలిపారు.

ఐక్యతకు కార్తీక వన సమారాధనలు

- వైభవంగా కార్తీక వన సమారాధన

విశాలాంధ్ర-రాజానగరం : ఐక్యతకు ప్రతిరూపాలుగా కార్తీక వన సమారాధనలు నిలుస్తాయని శ్రీ లక్ష్మీ గణపతి వర్తక సంఘం అధ్యక్షులు బొల్లెపల్లి వీరపండు, గౌరవ అధ్యక్షులు గ్రంధి నానబ్బులు,అడ్వైజర్ దాసరి శ్రీనివాస్ అన్నారు.కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని దివాన్ చెరువు గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీ గణపతి వర్తక సంఘం ఆధ్వర్యంలో స్థానిక చందన రమేష్ తోటలో ఆదివారం కార్తీక వన సమారాధన వైభవంగా నిర్వహించారు.దీనిలో భాగంగా ఉసిరి చెట్టుకు,అది దంపతులైన శ్రీశివ పార్వతులకు, దేవ దేవుడైన శ్రీ లక్ష్మీనారాయణ చిత్ర పటాలకు ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ గణపతి వర్తక సంఘం అధ్యక్షులు బొల్లెపల్లి వీర పండు, గౌరవ అధ్యక్షులు గ్రంధి నానబ్బులు,అడ్వైజర్ దాసరి శ్రీనివాస్ మాట్లా డుతూ కార్తిక మాసంలో తొలి అన్నవితరణ కార్యక్రమాన్ని తమ వర్తక సంఘం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు సత్తిబాబు కోశాధికారి గ్రంధి గణేష్, సంఘ సభ్యులు అర్జున్ రావు కంకటాల మూర్తి, దుర్గారావు, డేవిడ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

షష్టి ఉత్సవాలకు శ్రీకారం

విశాలాంధ్ర - బిక్కవోలు/అనపర్తి : రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిన బిక్కవోలు శ్రీ సుబ్రహ్మణ్య స్వామి షష్టి ఉత్సవాలకు ఆదివారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు పందిరి రాట మంచి చేసి శ్రీకారం చుట్టారు. వేదమంత్రోచ్చరణతో నల్లమిల్లి దంపతులు పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గం కూటమి నాయకులు, బిక్కవోలు మండలం& గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో జేసీ పర్యటన

గ్రామం రామేశ్వరం తుఫాను షెల్టర్ ఆదివారం జాయింట్ కలెక్టర్ నిషాంతి పరిశీలించారు. ఆయా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించిన జెసి నిశాంతి. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ తీర ప్రాంతాలలో తుఫాను ఎదుర్కోవ డానికి అన్ని

విశాలాంధ్ర-కాకినాడ/అల్లవరం: ముంచు కొస్తున్న మంత తుఫానును ఎదుర్కోడా నికి అన్ని ఏర్పాట్లు చేసామని జిల్లా జాయి ంట్ కలెక్టర్ నిశాంతి వెల్లడించారు. తీవ్ర తుఫాను ప్రభావం ఉంటుందని భావి స్తున్న అల్లవరం మండలం ఓడలరేవు కొమరగిరిపట్నం ఏర్పాట్లు చేసమని తెలిపారు. ఆమె వెంట ఓడలరేవు సర్పంచ్ మల్లాడి ఉమామహాలక్ష్మి, కొమరగిరిపట్నం సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఎమ్మార్వో, ఎంపీడీవో, స్పెషల్ అధికారితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

'మొంథా' తుఫానుతో ముందస్తు చర్యలు

సహాయ చర్యలపై రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు విజ్ఞప్తి

విశాలాంధ్ర-కాకినాడ : రాబోయే తీవ్ర తుఫాను 'మొంథా' నేపథ్యంలో, కాకినాడ ప్రజల భద్ర తకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశ్యంతో, రాజ్యసభ సభ్యులు, కాకినాడ వాసి, సానా సతీష్ బాబు నేడు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పోలీసు సూపరింటెం డెంట్ (SP)లకు అధికారికంగా లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, అక్టోబర్ 28వ తేదీ సాయ ంత్రం 'మొంథా' తుఫాను కాకినాడ తీరాన్ని తాకే అవ కాశం ఉన్న నేపథ్యంలో, ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు యుద్ధప్రాతి పదికన తక్షణ ముందస్తు మరియు సహాయక చర్యలు చేపట్టాలని సతీష్ బాబు కోరారు.

లేఖలోని ముఖ్య సూచనలు : తక్షణ తరలింపు : ముఖ్యంగా తీరప్రాంతం మరియు లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తక్షణమే తరలించాలి. నిరంతరాయ సేవలు: విద్యుత్ మరియు సమాచార వ్యవస్థలు నిరంతరంగా కొనసాగేలా ఏర్పాట్లు చేయాలి. **సరఫరాలు, ఆశ్రయాలు(షెల్టర్లు) :** అవసరమైన ఆహార, వైద్య సరఫరాలు మరియు పటిష్టమైన భద్రతా షెల్టర్లను అందుబాటులో ఉంచాలి. **అప్రమత్తత :** పోలీసు, వైద్య, మున్సిపల్ సహా అన్ని సంబంధిత శాఖల మధ్య సమన్వయం చేసి, అప్రమత్తతతో చర్యలు చేపట్టాలి. సానా సతీష్ బాబు తన లేఖలో ప్రజల సహాయం మరియు పరిపాలనతో సమన్వయం కోసం తన కార్యాలయం 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. **ప్రజల కోసం సహాయక నంబర్లు :** అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఈ క్రింది నంబర్లను సంప్రదించవచ్చు : సానా సతీష్ బాబు కార్యాలయం సహాయక నంబర్లు : 0884 297 3555 9666622227, తుఫాను వలన ప్రభావితమైన ప్రజలకు సమాచార మరియు సహాయ కార్యక్రమాలలో తమ బృందం పూర్తిగా సహకరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. అవసరమైన ప్రతి సహాయానికి సానా సతీష్ బాబు ఫౌండేషన్ జిల్లా అధికారులతో కలిసి పనిచేయడానికి సంసిద్ధంగా ఉన్నాము అని తెలియజేసారు.

పాఠశాలను ఆకస్మిక తనిఖీ

ఎస్సీ కమిషన్ డైరెక్టర్ కెవిస్ జవహర్కమిషన్ డైరెక్టర్ కేవిస్ జవహర్

విశాలాంధ్ర-జగ్గంపేట : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ డైరెక్టర్ కెవిస్ జవహర్ జగ్గంపేటలోని ఎస్సీ గురుకుల పాఠశాలను ఆది వారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు వసతి గృహంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను దగ్గరుండి పరిశీలించారు. విద్యార్థినులకు వడ్డించే భోజనాలను స్వయంగా రుచిచూశారు. అనంతరం విద్యార్థినులు బాగోగులను అడిగి తెలుసుకున్నారు. జగ్గంపేట మండలంలోని సీతానగరం గ్రామంలో వార్డు సభ్యులు కోడూరి సత్యనారాయణ తండ్రి వెంకట్రావు మృతిని చింతిస్తూ వారి కుటుంబాన్ని ఆదివారం పరామర్శిం చారు. వెంకట్రావు నేత్రదానం ఎందరికో ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పల రాజు, మండల ఎస్సీ సెలబ్రేషన్ సొంపత్తుల రాజశేఖర్, కాకినాడ జిల్లా విభిన్న ప్రభావంతుల అధ్యక్షుడు మండపాక అప్పన్న దొర, జుత్తుక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్ఎస్ఎస్ వారోత్సవాలు

విశాలాంధ్ర-మామిడికుదురు : మామిడికుదురు దీప్తి జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విద్యార్థులచే ఏడు రోజుల పాటు పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టామని దీప్తి విద్యాసంస్థలు కరస్పాండెంట్ డివివి సత్యనారాయణ అన్నారు. ఆయా గ్రామాల్లో గ్రామ సర్పంచ్, గ్రామస్తులు సహకారంతో పారిశు ధ్య కార్యక్రమాలు, మొక్కలు నాటుట, అవగాహన సదస్సులు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ ప్రత్యేక సేవా కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఏ ఈశ్వర రావు, మరియు విద్యార్థులు పాల్గొంటారని ఒక ప్రకటనలో తెలిపారు.

సాహిత్య, సాంస్కృతిక రంగాలకు ప్రోత్సాహం

-కవి సంధ్య దశాబ్ది ఉత్సవంలో మల్లాడి
- శిఖామణి సాహితీ పురస్కారాలు ప్రదానం

విశాలాంధ్ర - యానాం : సాహిత్య, కళా సాంస్కృతిక రంగాలకు తగిన ప్రోత్సాహం అందించవలసిన ఆవశ్యకత ఉందని పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ నగర్ కళ్యాణ మండపంలో కవిసంధ్య సాంస్కృతిక సంస్థ దశాబ్ది ఉత్సవం అలాగే శిఖామణి సాహిత్య పురస్కారాల ప్రదానం జరిగింది. ఈ సభకు మల్లాడి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ కవులు, రచయితలు సమాజాన్ని చైతన్యవంతం చేస్తారని తెలిపారు. అయితే వారి రచనలు పుస్తక రూపంలోకి తీసుకురావడానికి కొంత మంది ఇబ్బంది పడతారని అటువంటి కవులకు ఆర్థికంగా ప్రోత్సాహం అందించాలన్నారు. వచ్చే ఏడాది నుంచి ముగ్గురు స్థానిక కవులకు, అలాగే ఇతర జిల్లాలకు చెం దిన పుస్తకాల ముద్రణకు ఆర్థిక సహాయం, అలాగే కవిసంధ్య కార్యక్రమాలకు తోడ్పాటును అందించనున్నట్లు తెలిపారు. సభకు అధ్యక్షత వహించి శిఖామణి, దాట్ల దేవదానంరాజు, డానియల్ నెజర్స్ తదితరులు మాట్లాడారు.

శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదానం : సాహిత్యంలో జీవన సాఫల్య కృషికి ఇచ్చే శిఖామణి సాహితీ పురస్కారంను మూర్తిదేవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పద్మశ్రీ, ఆచార్య కొలకలూరి ఇనాక్, అలాగే కవిత్వంలో యువ కవులకు ఇచ్చే శిఖామణి యువ పురస్కారంను అవధులు మణిబాబు లకు మల్లాడి, శిఖామణి ప్రదానం చేశారు. పూలమాలలు, శాలువా, మెమె ంటో, సన్మానపత్రంతో సత్కరించి నగదుబహుమతి అందజేశారు.

పదిమందికి కవి సంధ్య ప్రతిభా పురస్కారాలు ప్రదానం : సభలోఎస్ఆర్ పృధ్వీ, పిఆర్ఎల్ స్వామి, బివిఎస్ మంగేష్, డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, పుప్పాల సూర్యకుమారి, పొనుగుమట్ల అశోక్ కుమార్, పెనుమాక రత్నాకర్, మిరప మహేష్లకు కవిసంధ్య ప్రతిభా పురస్కారాలను అందించి ఘనంగా సత్కరించారు. ఇనాక్ సాహిత్యంపై డాక్టర్ కోయి కోటేశ్వం రావు, అవధానుల మణిబాబు కవిత్వంపై డాక్టర్ కాళ్లకూరి శైలజ మాట్లాడారు. మధునాపంతుల సత్య నారాయణమూర్తి, పొనుగుమట్ల అశోక్ కుమార్, వివిధ ప్రాంతాలకు చెందినకవులు, రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

కాకినాడలో పునరావాస కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర-కాకినాడ : వాతా వరణ శాఖ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో నగరంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను అధికారులు ఆదివారం సాయం త్రం సందర్శించారు. నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సాగిలి ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ కేటీ సుధాకర్, అర్బన్ తహసీల్దార్ జితేందర్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీ చరణ్, తదితరులు కాకినాడ నగరంలోని జగన్నా ధపురం ప్రాంతంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక పునరావాస కేంద్రాలను పరిశీ లించారు. జగన్నాథపురం ప్రాంతంలో పరదేశమ్మ పేట, నాగరాజు పేట ప్రాం తాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను కూడా సందర్శి ంచి, అక్కడి సదుపాయా లను పరిశీలించారు. కేంద్రాల్లో ఉన్న సిబ్బందికి తగిన సూచనలు జారీ చేసి, తుఫాన్ పరిస్థితుల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-రౌతులపూడి : రౌతులపూడి మండలం పారుపాక గ్రామంలో ఆది వారం శ్రీసాయి అభ్యుదయ ఫౌండేషన్ ఆధ్వర్య ంలో గ్రామ ఉపాధ్యా యులకు, ప్రభుత్వ ఉద్యోగులకు సన్మాన కార్యక్రమ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యా ర్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయునికే ఉందని ఈ గ్రామంలో ప్రభుత్వ బడిని ప్రైవేటు స్కూలుకు ధీటుగా తయారు చేయడానికి కావలసిన సహకారం అందిస్తామని ఫౌండేషన్ వ్యవస్థాపకులు వి గిరీష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గాడి కొండబాబు, ప్రధానోపాధ్యా యులు వెంకట శివ గిరి, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు వరహాలబాబు, గ్రామసర్పంచ్ పకుర్తి లక్ష్మి, ఎంపీటీసీ గెద్దం వెంకటలక్ష్మి, పిఎసి యస్ డైరెక్టర్ జయసింగ్ రావు, గ్రామ పెద్దలు తిరుమల వెంకన్న దొర, శ్రీనివాస వర్మ, జయబాబు, శేఖర్ తదితరులు హాజరయ్యారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం, రాష్ట్ర విద్యార్థి విభాగం జోన్ 2 వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీక రణకు వ్యతిరేకంగా వైసీపీ ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరించారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకర ణపై సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేయడం జరుగుతుందని, మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణపై ప్రజలలో గ్రామ, గ్రామాన అవగాహన కల్పిస్తామని, ప్రజా ఉద్యమంలో భాగం గా కోటి సంతకాలు సేకరించి గవర్నర్కి సమర్పి స్తామని తెలిపారు. ఈనెల 28న నిర్వహించబోయే ర్యాలీలో అందరూ పాల్గొని విజయవంతం చేయా లని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుల్లా రాము, రాష్ట్ర పబ్లిసిటీ విభాగం

రామకుర్తి జాగాలు, జగ్గంపేట టౌన్ అధ్యక్షులు కాపవరపు ప్రసాద్, జిల్లా కార్యదర్శి వరుపుల సూరిబాబు, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు రావుల సురేష్ కుమార్, కాట్రావులపల్లి గ్రామ సర్పంచ్ పిట్టా సుగుణరావు, నియోజకవర్గ శ్రామిక విభాగం అధ్యక్షులు గుర్రం మహాలక్ష్మి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు కరటూరి వీర్రాజు, మండల ఉపాధ్య క్షులు భూమాడ గణపతిరావు, వానాసి సుబ్రహ్మ ణ్యం, రామవరం గ్రామ పార్టీ అధ్యక్షులు దొడ్డ సూరిబాబు, నంగరా నాని, మేడిశెట్టి సింహాచలం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

CORRECTION NAME & DOB

I, SHAIK ASIA BEGAM (Old Name), **W/O. ABDUL RAJAK,** DOB: 25-12-1972. Resident of D.No.2-24-5/4, Beside Sarcas Building, Santhi Nagar, Nidadavole, West Godavari Dist, A.P. I have Changed my name as **SHAIK ASIYA BEGAM** (New Name), **W/O. ABDUL RAJAK, DOB: 25-12-1975** Hereafter my name is Known as **SHAIK ASIYA BEGAM** (New Name), **W/O. ABDUL RAJAK,** for all purposes.

విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలి : మల్లాడి

విశాలాంధ్ర - యానాం : విద్యార్థులు విద్యతో పాటు క్రీడారంగానికి ప్రాధా న్యనివ్వాలని ఆవిధంగా క్రీడానైపుణ్యా లను అలవర్చుకోవాలని పుదుచ్చేరి ప్రభుత్వఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ స్టేట్ స్కూల్ గేమ్స్ చాంపియన్షిప్ 2025-28 పోటీలు ముగింపు సందర్భంగా డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహుమతుల ప్రధానోత్సవంలో ఆయన మాట్లాడారు. యానాంలో ఉన్న క్రీడాసౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విజేతలైన పుదుచ్చేరి, మాహే, కారైకల్, యానాం క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏ ఐఎస్ అధికారి అంకిత్కుమార్, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, రవికుమార్ పాల్గొన్నారు. బాడ్మింటన్ అండర్-14లో జోన్-1 పుదుచ్చేరి, కారైకల్, జోన్-2 పుదుచ్చేరి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించగా అండర్-17లో పుదుచ్చేరి, యానాం జోన్-1పుదుచ్చేరి, అండర్ 19లో పుదుచ్చేరి 1,2 కారైకల్, బాస్కెట్బాల్ పోటీల్లో అండర్-19లో పుదుచ్చేరి-1,4 యానాం, ఖోఖోలో పుదుచ్చేరి-2, 3,4 జోన్లు, వాలీబాల్లో పుదుచ్చేరి 1,3,4 జోన్లు విజయం సాధించాయి.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-మామిడికుదురు : ఎన్డీయే కూటమి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాస రాజా అన్నారు. పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆదేశాల ప్రకారం పాసర్లపూడి గ్రామ పంచా యతీ కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కూటమి నాయకులు పంపిణీ చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని వారు పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పెద్దపీట వేస్తున్నారని, అనారోగ్యంతో బాధపడుతున్న వారు భయపడవద్దని ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందిస్తామని మామిడికుదురు మండల ఎన్డీయే కూటమి నాయకులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, వాసంశెట్టి వెంకటరమణ, సొసైటీ అధ్యక్షులు మందా గాంధీ, జనసేన నాయకులు బల్ల సతీష్, గుబ్బల పండు, జవ్వాది నాని, తదితర నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బౌద్ధ ధర్మ ప్రచార రథం పర్యటన

విశాలాంధ్ర-అమలాపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన ప్రభుత్వ ధర్మాన్ని ప్రసారం చేసే భారతీయ బోధిసత్వ బౌద్ధ ధర్మ సాంస్కృతిక ప్రచార రథం ఆదివారం అమలాపురంలోనే త్రీరత్న బుద్ధ విహార ప్రాంగణంలో ప్రారంభించారు. కార్యక్రమంలో బౌద్ధ ఉపాసకులు బంతి జీ భిక్షువు అభయ్ సంబోధి ఎస్ భూపతి, డిబిలోక్ కెవివి సత్యనారాయణ, బిబిఆర్ ప్రసాద్, మట్టా వెంకటరావు, జి రమేష్, నాగ బత్తుల ప్రసాద్, పెనుమాల చిట్టిబాబు, సాపే బాల రవి, ఉండు శ్యామల రావు తదితరులు పాల్గొని ప్రారంభించారు. అయినవిల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బౌద్ధ ధర్మాన్ని బోధిస్తూ ప్రచార రథం తిరిగింది. ప్రతి ఆదివారం బోధిసత్వ బౌద్ధ ధర్మ సాంస్కృతిక ప్రచార రథం గ్రామాల్లో విరివిగా పర్యటించి బౌద్ధ ధర్మాన్ని ప్రచారం చేస్తుందని నాయకులు తెలిపారు.

ఘనంగా శ్రీకాంత్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-అమలాపురం: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి కో ఆర్డినేటర్ శ్రీకాంత్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం అమలాపురంలోని ఆయన స్వగృహంలో ఘనంగా జరిగాయి. భారీగా తరలివచ్చిన అభిమానుల హర్షధ్వానాల మధ్య శ్రీకాంత్ చేత వైసిపి రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకాంత్ పుట్టినరోజు వేడుకలకు మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, చిర్ల జగ్గిరెడ్డి, బొమ్మి ఇజ్రాయిల్, కర్రీ పాపారాయుడు, పిల్లి సూర్య ప్రకాష్, దవులూరి దొరబాబు, జక్కంపూడి గణేష్, పితాని బాలకృష్ణ, పాముల రాజేశ్వరి దేవి, గన్నవరపు శ్రీనివాస్, పులుసుగంటి రాజేశ్వరి, తోరం గౌతమ్, దెంతులూరి రోహిత్ వర్మ, స్వర్ణ, రజని తదితరులు పాల్గొన్నారు.

చిట్టి కొండను పరామర్శించిన వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరి బాబు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రత్తిపాడులో ప్రముఖ ఆర్ ఎంపీ వైద్యులు డాక్టర్ అందె చిట్టి కొండ ఇటీవల కాలంలో అనారోగ్యంతో బాధపడటంతో ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో ఈనెల 28వ తేదీన ప్రత్తిపాడులో జరిగే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జరిగే ప్రజా ఉద్యమ ర్యాలీ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలన ప్రైవేటీకరణ చేయడం దారుణమని చంద్రబాబుకు త్వరలోనే ప్రజలు బుద్ధి చెప్తారని గిరిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామిశెట్టి నాని, వైసిపి మండల వైస్ ప్రెసిడెంట్ కిల్లాడి బాబ్జి, పాలిక విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో 'రైతు బజార్'

విశాలాంధ్ర-సీతానగరం: ఉపయోగం లోకి రాకుండానే శిథిలావస్థకు 'రైతు బజార్'. మండలంలో రఘుదేవపురం గ్రామ పంచాయితీ పరిధిలో జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దగ్గర్లో రైతు బజార్ నిర్మించి సుమారు 8 సంవత్సరాలు అవుతున్నా నేటికీ ఉపయోగంలోకి రాకపోగా అది పిచ్చి మొక్కలతో శిథిలా వస్థకు చేరుతుంది. 2015 నాటి సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వ పాలనలో నాటి టీడీపీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ సుమారు 20 లక్షల రూపాయల వ్యయంతో ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండే విధంగా ముందు చూపుతో ఈ నిర్మాణం చేసి ప్రారంబించారు. అయితే తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రైతు బజార్ ను మళ్ళీ ప్రారంభోత్సవం చేశారు కానీ అప్పటి నుండి నేటి కూటమి ప్రభుత్వంలో కూడా ఈ రైతు బజార్ ను వాడుకలోకి రకపోవడం పై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రైతు బజార్ వాడుకలోకి వస్తె రఘుదేవపురం ప్రధాన ఆంజనేయ స్వామి గుడి సెంటర్లో గల మాంసం, కూరగాయల దుకాణాలను అక్కడకు తరలిస్తే సెంటర్లో ట్రాఫిక్ తగ్గుతుంది అని ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నత అధికారులు, నాయకులు చర్యలు చేపట్టి శిథిలం అయిపోతున్న రైతు బజార్‌ను వాడుకలోకి తీసుకొచ్చి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

తుఫాన్ ప్రభావంపై ఉన్నతాధికారులు సమీక్ష సమావేశం

విశాలాంధ్ర - తాళ్లరేవు : తాళ్లరేవు మండలంలో ఆదివారం ఎమ్మార్వో కార్యాలయంలో తుఫాను హెచ్చరికల నేపథ్యంలో తాళ్ళరేవు తహసీల్దారు వారి కార్యాలయం నందు మండల స్థాయి. మరియు గ్రామస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కాకినాడ ఆర్డీవో మల్లి బాబు మరియు దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కలెక్టర్ భారతిల ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. తుఫాను ప్రభావతి ప్రాంతాలైన తీర ప్రాంతాలలో గాడి మొగ ప్రాంతాన్ని సందర్శించి తుఫాను ప్రభావిత తీవ్రతను ప్రజలకు తెలియజేసి అప్రమత్తం చేశారు. మండలంలోని ప్రతి పంచాయతీకి చెందిన రెవెన్యూ మరియు హెల్త్ సిబ్బందితో ఎప్పటికప్పుడు తుఫాను కారణంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని వారికి అవసరమైన అన్ని సదుపాయాలను సత్వరమే చేకూర్చాలని అదేవిధంగా విపత్తు సమయంలో ప్రతి ఇంట్లో త్రాగునీరు ఆహార సామాగ్రిని ముందుగానే సమ కూర్చుకోవాలని, ఈదురు గాలులు భారీ వర్షాల సమయంలో మట్టి గోడలు ఇండ్లలోను భారీ వృక్షాల క్రింద ఉండరాదని అవసరమైతే తప్ప ఇండ్ల నుండి బయటకు ఎవరు వెళ్లకూడదని ప్రతి గ్రామంలో మైకుల ద్వారా అనౌన్స్మెంట్స్ చేశారు. అదేవిధంగా ఈ నెల 27వ తేదీ నుండి 31వ తేదీ వరకు పాఠశాలలు మరియు కళాశాలలకు సెలవు ప్రకటించారు. ఇప్పటికే తాళ్ళరేవు మండలానికి చెందిన హోప్ ఐలాండ్ నుండి 82 కుటుంబాలకు చెందిన 360 మంది జనాభాను కాకినాడ రూరల్ మండలం డ్రైవర్స్ కాలనీ నాకు తరలించి వారికి పునరావాసం ఏర్పాటు చేయడం జరిగింది. మత్స్యకారులు సముద్రంలోనికి వేటకు వెళ్లరాదని సూచించారు. ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేందుకు కంట్రోల్ రూమ్ నెంబరు 9676 822336కు సంప్రదించవలసినదిగా తెలియజేశారు.

శాంతి, శ్రేయస్సు ఆధ్యాత్మిక వృద్ధిని పెంపొందించడానికి హోమాలు దోహదం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : రుగ్మతలను తొలగించి కుటుంబంలో శాంతి మరియు శ్రేయస్సు,ఆధ్యాత్మిక వృద్ధిని పెంపొందించడానికి హోమాలు పూజలు ఎంతగానో దోహదపడతాయని స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పేర్కొన్నారు. కార్తిక మాసం సందర్భంగా సిబిఎన్ ఆర్మీ నియోజకవర్గ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ యళ్ళ జగదీష్ కుటుంబ సమేతంగా అయిన అతిథి గృహములో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పాల్గొని పరమశివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ గణపతి హోమం, రుద్ర హోమం, చండీ హోమంతో పాటు నవగ్రహ హోమం, సుదర్శన హోమం, మహా మృత్యుంజయ హోమం వంటి అనేక పవిత్ర యజ్ఞాలు వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. హోమాలలో వివిధ రకాల పుష్పాలు, పత్రాలు, పండ్లు, ధాన్యాలు, ఉపయోగించి సంపూర్ణ పూజా విధానాలు అనుసరించారు. పండితులు సాంప్రదాయ ప్రకారం గణపతి ప్రథమ పూజ, నవగ్రహ ఆవాహన, రుద్ర అభిషేకం, చండీ పఠనం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలను నిర్విఘ్నంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో జగదీష్ బంధువులతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎన్.ఎం.ఈ.ఎల్ చర్చి సంఘ కాపరిగా గుర్రపు కిరణ్ బాబు నియామకం

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ధవలేశ్వరం లో ఉన్న ఎన్ఎంఈ లూథరన్ సంఘానికి లీగల్ గా, చట్టబద్ధంగా కాపరి గా తనను నియమించినట్లు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సంఘ కాపరి రెవరెండ్ గుర్రపు కిరణ్ బాబు తెలిపారు.శనివారం ధవలేశ్వరం ఎన్ఎంఈ లూథరన్ చర్చిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ సంఘం కంట్రోలర్‌గా జస్టిస్ కొరియన్ జోసెఫ్ హైకోర్టు సీజే నియమించినట్లు తెలిపారు వారి ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేటర్ గా నియమింపబడ్డారని వివరించారు.వారి పర్యవేక్షణలో ఏ ఎల్ సి సంఘంలో జరిగిన అవకతవకల పై విచారణ జరిపి సంఘాలలో సజావుగా ఎన్నికలు జరిపించేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. గత నాలుగు నెలల కాలంగా సంఘంపై విచారణ జరిపి గతంలో పాస్టర్‌గా విధులు నిర్వహించిన ఎస్ అనిల్ కిరణ్ కు షో కాజు నోటీసులు ఇచ్చారన్నారు. అయితే ఆ నోటీసులకు ఏ విధమైన సంజాయిషీ ,గాని వివరణ ఇవ్వకపోవడంతో సెప్టెంబర్ 25న ఆయనను సంఘం విధులు నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. తనను ఎన్ ఎమ్ ఈ లూథరన్ సంఘానికి కాపరిగా సెప్టెంబర్ 25న నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఇక్కడే పుట్టి సండే స్కూల్ నుంచి చర్చికి సేవలు అందించినట్లు వివరించారు. ఎన్.ఎం.ఈ సంఘానికి కాపరిగా నియమితులు కావడం దేవుని కృప అని అన్నారు. ఎన్ఎంఈ చర్చ్ అభివృద్ధికి కృషిచేసి సంఘం నుంచి వెళ్లిన సభ్యులను తిరిగి సంఘంలోకి రప్పించి చర్చి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీనియర్ అడ్వకేట్ గుమ్మడి పరమాత్మ మాట్లాడుతూ 15 నెలల నుంచి ఎన్ఎంఈ సంఘం స్థితిగతులను గుంటూరులో ఉన్న ఏ ఎల్ సి పెద్దలు అవకతవగలపై విచారణ జరిపారని తెలిపారు. చర్చి తాళాలను సబ్ కలెక్టర్, ఎమ్మార్వో, డీఎస్పీ, సిఐ, ఎస్ఐ, పోలీస్ అధికారుల సమక్షంలో గుర్రపు కిరణ్ బాబుకు శాశ్వత కాలపరిమితిలో అప్పగించారని వివరించారు. విలేకరుల సమావేశంలో ఎన్ ఎం ఈ సంఘ సభ్యులు ఐతా బత్తుల ప్రసాద్, పీతల ముత్యాలరావు, నక్క శ్యాంసుందర్, సకిలే రమేష్, తేగల రాజకుమార్, పీతల ఇమ్మానుయేలు రాజు తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వివాహితురాలు ఆచూకీ లభ్యం



విశాలాంధ్ర-గండేపల్లి : అదృశ్యమైన వివాహితురాలు ఆచూకీ లభ్యమైనట్లు దండేపల్లి ఎస్సై శివ నాగబాబు తెలిపారు. గండేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గండేపల్లి మండలం, నీలాద్రిరావుపేట గ్రామానికి చెందిన ఒక వివాహితురాలు అయిన 39 సంవత్సరాలు వయసుగల ఒక మహిళ మిస్సింగ్ కావడం జరిగింది. దానిపై గండేపల్లి పోలీసులు మిస్సింగ్ కేసు Cr.No.342/2025గా నమోదు చేయడం జరిగింది. దానిపై ఎంజూ పెద్దా పురం మరియు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆదేశాలు ప్రకారం గండేపల్లి ఎస్సై శివ నాగబాబు ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి కాకినాడ జిల్లాలో గొల్ల ప్రోలు గ్రామంలో భద్రంగా ట్రేస్ చేయుటం జరిగింది. ఆమెను గొల్ల ప్రోలు గ్రామం నుండి నుండి గండేపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చి ఆమె తల్లి, మరియు భర్తకు అప్పగించడం జరిగిందని గండేపల్లి ఎస్సై తెలిపారు.

కూలిన వంతెనను కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-కలిదిండి: కలిదిండి మండలం లోల్ల డ్రైన్ పై కూలిపోయిన వంతెనను ఆదివారం అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పరిశీలించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, కూలిపోయిన డ్రైన్ ను దాటే ప్రయత్నం చేయవద్దని, మొంథా తుఫాన్ కారణంగా కైకలూరు నియోజకవర్గంలో రాబోయే 3 రోజులపాటు తీవ్రమైన గాలులు, భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అధికారులతో సహకరించి ముంపు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు రావాలన్నారు. తూఫాన్ తీరం దాటే సమయంలో మంగళవారం తీవ్రమైన గాలులు, భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ఆ సమయంలో ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావద్దన్నారు. చెరువుల వంటి ప్రదేశాల వద్దకు వెళ్లవద్దని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా అధికారులు అప్రమత్తం చేయాలన్నారు. తూఫాన్ ప్రమాదం తొలగిన వెంట దెబ్బతిన్న వంతెన స్థానంలో మూడు రోజులలో తాత్కాలిక వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మొంథా తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తతతో ఉండాలన్నారు. ముఖ్యంగా లంక గ్రామంలోని మత్స్యకారులు చేపలు వేటకు వెళ్లవద్దని సూచించారు. తూఫాన్ సమయంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు పెదయడ్లగాడి వంతెన వద్ద వరద పరిస్థితిని కలెక్టర్ వెట్రిసెల్వి పరిశీలించారు. కలెక్టర్ వెంట జయమంగళ వెంకటరమణ, అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, తహసీల్దార్, ఎంపిడిఓ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొంథా తుఫానుతో..రెడ్ అలర్ట్

సురక్షితంగా ఉండండి అప్రమత్తతే మన బాధ్యత : మంత్రి సుభాష్

కలెక్టర్, ఆర్డీవో, తహసిల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

విశాలాంధ్ర - కాజులూరు/రామచంద్రపురం : బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రజలకు సూచించారు. భారత వాతావరణ శాఖ సూచనల మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల క్షేమం కోసం ఈనెల 28, 29 తేదీల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారని, తుఫాను ప్రభావాన్ని బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తీర ప్రాంతాల్లో తుఫాను ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల కలెక్టర్లతోనూ, కృష్ణా జిల్లా కలెక్టర్ తోనూ మాట్లాడి తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రభుత్వం అన్ని జిల్లాలకు ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందన్నారు. ముఖ్యంగా తీర ప్రాం తాలైన కృష్ణా, గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాలు ప్రజలు మరింత అప్రమత్తతో ఉండాలని కోరారు. తుఫాను 28 రాత్రి కృష్ణా-విశాఖపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరం తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది అన్నారు. తుఫాను రాకముందే గరిష్ట గాలి వేగం 90-110 కిమీ వరకు ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు బయటకు రాకుండా సురక్షితంగా ఉండాలన్నారు. తీరప్రాంత గ్రామాలు, మత్స్యకారులు, పర్యాటకులు తక్షణం అప్రమత్తం కావాలని కోరారు. బోట్లను హార్బర్‌లో నిలిపివేయాలని, అన్ని రక్షణ సామాగ్రిని సిద్ధంగా ఉంచాలని (లైఫ్ జాకెట్లు, రెస్క్యూ వస్తువులు) అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. తీరప్రాంత గ్రామాల ప్రజలను, అతి ప్రమాదకరమైన ప్రాంతాలను నుంచి సురక్షితమైన ప్రాంతాలకు, తుఫాన్ షెల్టర్లకు ముందుగానే తరలించే చర్యలు చేపట్టామని ఈ సందర్భంగా వెల్లడించారు. స్థానిక అధికారులు, లైఫ్‌గార్డులు, పోలీసుల సూచనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. విద్యుత్, సంచార నెట్‌వర్క్ సమస్యలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ప్రత్యేక శ్రద్ధతో ఉండాలన్నారు. తుఫానుకోసం ఇబ్బందులు ఉంటేయా కంట్రోల్ రూమ్‌లకు ఫోన్ చేసి సహాయం పొందాలని మంత్రి సుభాష్ ప్రజలకు తెలిపారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు ; ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్డు బంద్

విశాలాంధ్ర-యుకొత్తపల్లి : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కాకినాడ సమీపంలో తీరం దాటుతుందని వాతావరణ శాఖ తెలపడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తుఫాన్‌పై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ ఆర్డిఓ మల్లిబాబు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా పరిషత్ కార్యాలయంలో మత్స్యకార నాయకులకు మండల అధికారులకు ఆదివారం ఆర్డిఓ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్ర వాయుగుండంగా కాకినాడ కదులుతున్న తరుణంలో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకుండా చూసే బాధ్యత మత్స్యకార నాయకులపై ఉందని ఆయన తెలిపారు. మండల స్థాయి అధికారులు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలను సురక్షితంగా చూసే బాధ్యత ప్రతి అధికారి పై ఉందని తెలిపారు. అవసరమైతే తప్ప ప్రజలు ఎవరు బయటకు రావద్దని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్వో జి చిన్నారావు, ఎంపీడీవో లక్ష్మీ రెడ్డి పలు అధికారులు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్డుబంద్ : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్డును రెండు రోజులపాటు బంద్ చేసినట్లు కొత్తపల్లి ఎస్సై వెంకటేష్ ఆదివారం తెలిపారు. తీర ప్రాంతం అలలు తీవ్రతగా ఉంటాయని వాహనదారులు ఇబ్బందులకు గురి కాకుండా ముందస్తుగా బీచ్ రోడ్డును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బందు చేసినట్లు తెలిపారు. కాకినాడ వెళ్లేవారు పిఠాపురం మీదగా కాకినాడ చేరుకోవాలని ఆయన సూచించారు. నేమం, ఉప్పాడ రింగ్ రోడ్డు వద్ద వాహనాలు వెళ్లకుండా భారీ కేడ్లను ఏర్పాటు చేయడం జరిగిందని వాహనదారులు గమనించి సహకరించాలని కోరారు.

మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తాం

విశాలాంధ్ర -కోరుకొండ గోకవరం : భారత్ ప్రధాని నరేంద్ర మోదీ రేడియో ద్వారా ప్రజలకు ప్రసంగించే మాన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తామని, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద మాన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం పార్టీ నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో కలిసి టీవీలో ప్రత్యక్షంగా వీక్షించారు. నరేంద్ర మోదీ 127 ఎపిసోడ్ ద్వారా పలు అంశాలను హిందీలో ప్రసంగించారు. వాటిని కంబాల శ్రీనివాసరావు తెలుగులో నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల నాలుగో ఆదివారం నరేంద్ర మోదీ నిర్వహించే మాన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు వీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు. శ్రీనివాసరావు పిలుపు మేరకు మండలంలోని ప్రతి బూత్‌లో మాన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించారు.

జిల్లా వ్యాప్తంగా విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్‌లు

- భీమవరం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.ఉషారాణి

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో మంథన తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేయడం జరిగిందని, భీమవరం,నరసాపురం, తాడేపల్లి గూడెం కార్యాలయంలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయడం జరిగిందని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ భీమవరం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.ఉషారాణి చెప్పారు. జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఎటువంటి విపత్కర పరిస్థితులనైన ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారని, జిల్లా కలెక్టర్, తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వారి ఆదేశాల మేరకు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకుగాను భీమవరంలోని జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం 9490610152, భీమవరం డివిజన్ ఆఫీస్ కంట్రోల్ రూమ్ 9493177646, నరసాపురం డివిజన్ 7382050943, తాడేపల్లిగూడెం డివిజన్ 9493177806 నెంబర్ తో 24 గంటలపాటు 3 షిఫ్టుల్లో పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భారీ వర్షములు మరియు వరదల కారణముగా ఏదైనా విద్యుత్ అంతరాయము లేదా సమస్య తలెత్తినచో దగ్గరలో గల విద్యుత్ సెక్షన్ ఆఫీసునకు గాని, టోల్ ఫ్రీ నంబరు 1912 కు గాని భీమవరం సర్కిల్ ఆఫీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9490610152 నకు గాని ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్ఈ పి.ఉషారాణి తెలిపారు.

కార్తీక మాసం హరిహర మహా క్షేత్రంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

విశాలాంధ్ర - కడియం : ఈనెల 22వ తేదీ నుండి నవంబర్ 20వ తేదీ వరకు జరిగే హరి హరులకు అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం సందర్భంగా గౌతమి నదితీరాన గల రాజమండ్రి రూరల్ కడియం మండలం కడియపులంక శ్రీ హరి హర మహా క్షేత్రమైన శ్రీ అపర్ణ సమేత అనంతేశ్వర స్వామి వారి పంచాయతన క్షేత్రంలో సప్తదశ (17)వ కార్తీక మాస మహోత్సవం సందర్భంగా భక్తులకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చక స్వామి దేవరభట్ల శ్రీనివాస శర్మ (నాని) మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్తీక మాసంలో గల 4 సోమవారాలకు సంబంధించి అభిషేకాలు నిర్వహించుకునే భక్తులకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు కాలువ రేవులు వద్ద అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలతో పాటు కాలువ రేవులను పరిశీలించారు. దర్శనాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్తీక మాస దీపోత్సవంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. నవంబరు 18వ తేదీ మంగళవారం మాసశివరాత్రిని పురస్కరించుకుని భారీ అన్నదానాన్ని ఆలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆలయానికి వచ్చే భక్తులకు జాతీయ రహదారిపై ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కడియం సిఐ ఏ వెంకటేశ్వరరావు, ఎస్సైలు బి నాగ దుర్గ ప్రసాద్, పి ధనలక్ష్మి ప్రసన్న ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెనుమాక శ్రీను, చిట్టాల సత్తిబాబు, ఆరేటి వీరభద్రరావు, మల్లు రాజు, మల్లు పోలరాజు, చెక్కపల్లి గోవిందు, పంతం శ్రీను, నక్క ప్రసాదు, మల్లు ప్రసాదు, మండల కృష్ణ, ఆలా పెద్దబాబు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై గుంతలు పూడ్చించిన ఎస్సై

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : జాతీయ రహదారి 516 డి పై గోతులు ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలను నివారించడానికి సదును చేయించినట్లు జీలుగుమిల్లి ఎస్సై వి క్రాంతి కుమార్ తెలిపారు .ఆదివారం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వద్ద గోతులను పూడ్చారు. జాతీయ రహదారిపై గోతులు ఉండడంతో అందులో వర్షపు నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. రాబోయే ముంత తుఫాను వలన గోతులు పడకొండ జెసిబి సహాయంతో సదును చేయించినట్లు తెలిపారు. ప్రయాణికులు, ఆటోవాలా, లారీ డ్రైవర్లు శభాష్ ఎస్సై సారు అంటూ పలువురు ప్రశంసలు కురిపించారు.

ముందుస్తు జాగ్రత్త చర్యలు ఎన్డీఆర్ఎఫ్ బృందం రాక

18 సైక్లోన్ రిలీఫ్ కేంద్రాలు : మూడు రోజుల పాటు పాఠశాలలు, కళాశాలలకు సెలవు

విశాలాంధ్ర - యానాం : మొంథా తుఫాను దూసుకొస్తున్న నేపథ్యంలో యానాం నియోజకవర్గ పరిధిలో ముందస్తు రక్షణ చర్యలు చేపట్టినట్లు ఆర్ ఎ, ఐఎఎస్ అధికారి అంకితకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పిడబ్ల్యుడి, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయ తదితర శాఖలు చేపట్టాల్సిన చర్యలు గూర్చి ఇప్పటికే ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. యానాంకు ఎన్డీఆర్ఎఫ్ బృందం వస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా తుఫాను బాధితులను తరలించేందుకు వీలుగా 16 సైక్లోన్ రిలీఫ్కంద్రాలను ఏర్పాటు చేసినట్లు వాటిలో ప్రధానంగా స్కూల్స్, కళాశాలలు ఉన్నాయన్నారు. మూడురోజుల పాటు ఈనెల 27, 28, 29 తేదీల్లో సెలవు ప్రకటించినట్లు, మత్స్యకారులు ఎవరు వేటకు వెళ్లకుండా నిషేధం విధించినట్లు తెలిపారు. పర్యాటక కార్యక్రమాలును నిలుపుదల చేసినట్లు తెలిపారు. విద్యుత్శాఖను సైతం అప్రమత్తం చేసినట్లు, క్షతగాత్రులకు వైద్యసేవలు అందించేలా అంబులెన్సు, అత్యవసర మందులను ఉంచినట్లు తెలిపారు. చెట్లను తొలగించేలా జెసిబిలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని పుదుచ్చేరి ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి తెలియజేస్తున్నట్లు తెలిపారు.